ప్రజాసమస్యల పరిష్కార వేదిక వాయిదా

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం కడా ఆధ్వర్యంలో సోమవారం జరగవలసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికను వాయిదా వేస్తున్నట్టు పీడీ వికాస్ మరమ్మత్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావడానికి వేదికగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక పనిచేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించాల్సి ఉంది. అయితే కొన్ని అనివార్య కారణాలవల్ల కుప్పం కడా ఆధ్వర్యంలో జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్

- పట్టించుకోని గుజ్జు పరిశ్రమల యాజమాన్యం
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

ప్రజాశక్తి- బంగారుపాలెం

జిల్లాలోని గుజ్జు పరిశ్రమల యాజమాన్యలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్ పదేపదే మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని చెబుతున్నా పట్టించుకోవడంలేదు. తోతాపురి మామిడి పంట దిగుబడి వచ్చిన గుజ్జు పరిశ్రమల యాజమాన్యం రైతులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రైతులు అనుమతులు కోసం పరిశ్రమ చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యజమానులు, రైతు సంఘాల నాయకులతో ప్రభుత్వం పలుమార్లు చర్చలు జరిపి గిట్టుబాటు ధర నిర్ణయించినా ఆచరణలో ఇది అమలు కాక మామిడి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

జీడీ నెల్లూరు జైన్ ఫ్యాక్టరీ వద్ద మామిడి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ (ఫైల్‌ఫొటో)

తోతాపురి మామిడికి కేజీకి రూ.12 రూపాయలు అమ్మకం ధర ప్రభుత్వం నిర్ణయించిందని, పరిశ్రమలు రూ.8లు, రూ.4లు ప్రభుత్వం సబ్సిడీ రూపలంలో రైతులకు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని శనివారం జిల్లా పర్యటనలో రాష్ట్ర వ్యవసాయ, సహకార అనుబంధ రంగాల శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సైతం పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని మంగసముద్రం యార్డ్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఇదే విషయాన్ని గత నెల రోజులుగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పలుమార్లు మీటింగ్‌లు పెట్టి చెబుతున్నారు, ప్రత్యక్షంగానూ గుజ్జు ఫ్యాక్టరీల వద్ద మామిడి కొనుగోళును సైతం పరిశీలిస్తున్నారు. అయినప్పటికీ గుజ్జు పరిశ్రమల యాజమాన్యం మాత్రం వారి తీరు మార్చుకోవడం లేదు. మామిడిని రైతుల నుంచి కొనడానికి వారిని ఫ్యాక్టరీల చుట్టూ తిప్పుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కాకుండా రూ.4లకే కొనుగోళు చేస్తామని, చెల్లింపులు కూడా తరువాత చేస్తామని చెబుతుండటంతో రైతులు అయోమయంలో పడుతున్నారు. ప్రభుత్వం, కలెక్టర్ చెబుతున్నా, ఆదేశిస్తున్నా గుజ్జు పరిశ్రమల యాజమాన్యాం ఇంత నిర్లక్ష్యం వ్యవహరించడం దారుణం. దీనిపై మరింత దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలని పలు రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

గుజ్జు పరిశ్రమ పై చర్యలు తీసుకోవాలి

జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

పలుమార్లు కలెక్టర్ రైతులు, గుజ్జు పరిశ్రమ యాజమాన్యం చర్చలు జరిపిన మామిడికి ధర నిర్ణయించినా గుజ్జు పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నది. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా ఇంత ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోంది. ప్రభుత్వం ధర నిర్ణయించినప్పటికీ గుజ్జు పరిశ్రమలు సిండికేట్‌గా మారి వారికి అనుకూలమైన ధరకే కొనుగోలు చేస్తామని చెప్పడం ప్రభుత్వ ఆదేశాలను సైతం లెక్కచేయకపోవడమే దీనిపై జిల్లా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి. రైతులు ఆందోళనలు చేపట్టకముందే అధికారులు గుజ్జు పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపి రైతులకు తగు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళనలు తప్పవు.

ఆశలు అడియాశలయ్యాయి

జిల్లా రైతు సంఘం కార్యదర్శి శంకరన్

మామిడి పంటపై రైతులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. ప్రకృతి వైపరిత్యాల నుంచి, తెగుళ్ల నుంచి సంవత్సరమంతా మామిడి పంటను కాపాడుకున్న రైతులు పంటకు తగిన ధర వస్తుందని ఎదురుచూసినా ధర రాకపోగా పంట ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. గుజ్జు పరిశ్రమ వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి రైతులను అప్పుల్లో ఊబిలోకి నెట్టేస్తున్నది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలి.

జాతి అస్తిత్వానికి మూలస్తంభాలు కళలు

- ప్రముఖ సినీనటుడు రాజేందర్ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కళలు జాతి అస్తిత్వానికి మూల స్తంభాలని గుర్తుచేసే రోజు రావాలని ప్రఖ్యాత సినీ నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షులు మర్రెపూడి దేవేందర్ రావు నేతృత్వంలో జాతీయస్థాయి కళాకారుల సమ్మేళనం తెలుగు తేజాలకు కళాభిషేకం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సినీనటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిద్రపోతున్న జాతిని మేల్కొల్పే శక్తి కలలకు ఉందని, కళలను ప్రోత్సహించాలన్నారు రాయల కాలం స్వర్ణ యుగమైందని దీనికి కారణం నాడు కలలను ప్రోత్సహించడమే అన్నారు.. రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర ఉన్న కళారూపం కొన్ని దశాబ్దాల పాటు అంతరార్థమైందని ఇలాంటి పరిస్థితుల్లో కళాకారుల సమ్మేళనం నిర్వహించడం అమోఘమన్నారు. సుబ్రహ్మణ్యం శర్మ మాట్లాడుతూ సాంస్కృతి సాంప్రదాయాలు కలలకు కూడా విద్యాలయాల్లో ప్రాధాన్యం ఇచ్చేలా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆచార్యులు జ్యోతి సుభాషిని మాట్లాడుతూ కళలతోనే మనోవికాసం సాధ్యమన్నారు. కర్ణాటక సాంస్కృతిక విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య రామనాథం నాయుడు మాట్లాడుతూ కళలకు విజ్ఞాన విషయాలకు ఆలయాలే ఆటపట్టాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన 262 మందికి కళాజ్యోతి జాతీయ పురస్కారాలను నిర్వాహకులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమలో డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ , కఠారి హేమలత, మర్రిపూడి దేవేంద్ర రావు, డాక్టర్ నారాయణ స్వామి, డాక్టర్ మర్రి శశిధర్ రెడ్డి, సహదేవనాయుడు, ఎంఆర్ అరుణ కుమారి వీరి ముగ్గురిని ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

రాజేంద్ర ప్రసాద్‌ను సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు, ఎమ్మెల్యే

కవులకు'కళాజ్యోతి' జాతీయ పురస్కారాలు

వి కోట: వి కోట మండలానికి చెందిన ముగ్గురు కవులకు కళాజ్యోతి' జాతీయ పురస్కారాలు లభించాయి. చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆదివారం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవి.కేశవ రెడ్డి స్మారక ఫౌండేషన్ చిత్తూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన ద్విశతాధిక, కవులు, వివిధ సాహితీ కళాకారులను సన్మానించారు. ఈకార్యక్రమంలో వి. కోటకు చెందిన కవులు డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం, డాక్టర్ గడ్డం శాంతకుమారి, డాక్టర్ రఘుపతి లకుచోటు దక్కింది. వీకోట ప్రాంత కవులకు జాతీయ పురస్కారాలు లభించడం పట్ల పుర ప్రముఖులు, సాహితీ ప్రియులు అభినందనలు తెలియజేశారు.

వ్యక్తి నిత్య జీవితంలో యోగ ఒక భాగం

ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: వ్యక్తి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం కుప్పం మండలం కంగుంది కోటలో యోగా అవగాహన కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించగా యోగ గురువు బాబు యోగ విశిష్టతను వివరిస్తూ వివిధ ఆసనాలను వేసే పద్ధతిని నేర్పుతూ ఆ ఆసనాల ప్రాముఖ్యతను సవివరంగా తెలియజేశారు. ఈసందర్భంగా ఆర్టీసీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా జరుపుకోవడం జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మే 21 నుండి జూన్ 21 వరకు ప్రతి జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ప్రారంభించి వదిలేయకుండా ప్రతినిత్యం యోగా కార్యక్రమాన్ని దినచర్యలో భాగంగా అలవాటుగా మార్చుకోవాలని చెప్పారు. అలాగే కుటుంబ పెద్దగా ఉన్న వ్యక్తి యోగా చేస్తే వారి పిల్లలకు చిన్నప్పటినుండి అలవాటుగా మారుతుందని తద్వారా మీ ఆరోగ్యం, మీ కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, డాక్టర్ సురేష్, ఆర్గనైజర్ సెక్రటరీ రీజనల్ డైరెక్టర్ టూరిజం రమణ ప్రసాద్, ఆర్‌డిఓ శ్రీనివాసులు రాజు, డిఎస్‌డిఓ బాలాజీ, జిల్లా పర్యాటకశాఖ అధికారి గౌరీ, సర్పంచ్ సంపూర్ణ ధనశేఖర్ పాల్గొన్నారు.

టమాటా రైతు కుదేలు

- నల్ల మచ్చలతో పంట నష్టం
- 40 శాతం పంట వృధా
- నేలపాలైతున్న టమాటాలు

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం):

ప్రస్తుతం టమాటాలు కోతకు వచ్చిన సమయంలో నల్లమచ్చ తెగుళు రావడంతో టమాటాలపై నల్లమచ్చలు ఏర్పడి 40శాతం మేర చెట్ల నుండి రాలిపోవడంతో రైతులకు నష్టం తప్పడం లేదు. 15 రోజులు క్రితం కిలో కేవలం రూ.3, 4 లు ఉన్న టమాటా ధర ప్రస్తుతం రూ.20 నుండి 25లకు పెరిగింది. టమాటాకు ధర బాగా వస్తున్న సమయంలో ఇటువంటి నల్లమచ్చ తెగులు రావడంతో పొలంలోని చెట్ల నుండి 40 శాతం టామాలు నేలరాలిపోతున్నాయి, కోయడానికి ముట్టుకుంటే దుర్వాసన వస్తుందని రైతులు వాపోతున్నారు.

ధర పెరుగుతుందన్న ఆశతో మండలంలోని చాలా మంది రైతులు టమాటా సాగు చేస్తున్నారు. టమాటా పంటను పండించడానికి అవసరమైన మొక్కలు, సామగ్రి, ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలీల ఖర్చులు, దుక్కిదున్నడానికి ఇలా దాదాపు లక్షల్లోనే ఖర్చు పెడుతున్నారు. తీరా పంట చేతికంది కోతకు వచ్చే సమయానికి ఇలా తెగుళ్ల రైతుల ఆశలను ఆడియాశలు చేస్తున్నారు. టమాటా బాక్సులు మార్కెట్‌లో కొనుగోళుకు తెచ్చిన సమయంలో బాగా ఉన్న టమాటాలకు మంచి ధర వస్తుంది, అదే బాగాలేని టమాటాలకు రూ.100లు ధర తగ్గింపోతుంది దీంతో రైతులకు నష్టం తప్పదు. ఏది ఏమైనా ధరల పతనం ఓ వైపు, ప్రకృతి వైపరిత్యాలు ఓ వైపు రైతులను నష్టాల ఊబిలో కూరుకుపోయేలా చేస్తున్నాయి. నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం పంట నష్టం అందించా ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అమ్మకానికి పనికి రాని టమాటాలను పొలం వద్దే పడేసిన రైతులు

నష్టంమే మిగిలింది

- మునిరత్నం, రైతు

నాకు 12 ఎకరాల భూమి ఉంది. అందులో టమాటా సాగు చేశాను. పంటకు మొదటి నుండి దున్నకాలు, మొక్కలు, ఎరువులు క్రిమిసంహారక మందులు ఇలా రూ.10 లక్షల దాకా ఖర్చు అయింది. ప్రస్తుతం నల్ల మచ్చలు తెగుళు లేకుండా టమాటా కాయలు బాగుంటే మార్కెట్లో ధర బాగా పలికి పెట్టుబడి ఖర్చులుపోను ఎంతోకొంత ఆదాయం వచ్చేది. కానీ నల్లమచ్చల వలన ధర తగ్గిపోతుంది. పైగా పంట 40 శాతం పొలంలేనే పాడైపోతుంది. దీంతో నష్టమే మిగిలింది.

ధర లేక పొలంలనే వదిలేశాం..

- వి. మునెప్ప, రైతు

ఎకరా పొలంలో టమాటా పంట సాగుచేశాను. టమాటా కాయి సైజు తగ్గడమే కాకుండా నల్ల మచ్చరోగం ఉండడంతో చాలా వరకు టమాటాలకు ధర లేక పొలంలోనే వదిలేయాల్సి వచ్చింది. ఇప్పటికే లక్ష రూపాయలు వరకు ఖర్చు చేశాను, ప్రస్తుతం ధరలు ఉండటంతో ఎంతోకొంత ఆదాయం వస్తుందన్న ఆశతో ఉండగా ఇప్పుడు ఇలా తెగులు వలన పంట వృధా కావడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విజయం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. పేదలకు అవసరమైన వైద్యసేవలను ఉచితంగా అందించాలనే ఈ ప్రయత్నాన్ని అభినందించారు. బెంగళూరు కమ్మవారి సంఘం స్థాయిలో చిత్తూరు కమ్మవారి అభ్యుదయ సేవా సంఘాన్ని అభివృద్ధి చేసి విస్తృతంగా సేవా కార్యక్రమాల నిర్వహించాలని ఇందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తామన్నారు. వైద్య శిబిరంలో ప్రాథమిక వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, టిడిపి అధికార ప్రతినిధి వి. సురేంద్ర కుమార్, కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు, తిరుపతి అమర హాస్పిటల్ వైద్యులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ శ్రీ వర్ధంతిసందర్భంగా ఆదివారం వేమన విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రధానకార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ శ్రీ శ్రీ తన రచనల ద్వారా తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. వేమన విజ్ఞానకేంద్రం గౌరవ సలహాదారు టెంకాయల దామోదరం మాట్లాడుతూ శ్రీశ్రీ “మహాప్రస్థానం” తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించిందన్నారు. ఈకార్యక్రమంలో ముఖేష్, జయశంకర్, శివకుమార్, పద్మ, ప్రభాకర్, ఇమామ్, వినయలత, ప్రమోద్, ప్రసూన తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో 104 ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర, 104 ఉద్యోగుల సంఘం నాయకులు విక్టర్ మాట్లాడుతూ ఆరోబిందో యాజమాన్యం నుండి రావలసిన బకాయిలు, ఈఎస్ఐ గ్రాట్యూటీ వీటన్నింటినీ ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే చెల్లించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో 104 సర్వీస్‌లను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహించేదని, ఈ సంస్థ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు రావాల్సిన బకాయి వేతనాలు ఇతర బకాయిలు చెల్లించాలాని కోరారు. ప్రస్తుతం 104 సర్వీసులు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతీనెల వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలని డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరాల నుండి మరమ్మతులకు నోచుకోని వాహనాలను వెంటనే మరమ్మతులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 104 వాహనాల్లో క్షయ పరీక్షలకి సంబంధించిన నమూనాలు రవాణా మంచిది కాదని, ఈ వాహనాల్లో గర్భిణీ స్త్రీలను పరీక్షలు చేస్తున్నారని చాలా చోట్ల ఆరోగ్య కేంద్రాలు లేని చోట సిబ్బంది కూడా ఈ వాహనాల్లో సేవలు కొనసాగిస్తున్నారని దీనిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విక్టర్

పంటలను నాశనం చేస్తున్న ఏనుగుల గుంపు

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం దేవళంపేట, పాలెం పంచాయతీలలో ఆదివారం వేకువజామున వ్యవసాయ పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడి చేయడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగింది. తెల్లవారు జామున అడవుల్లో నుంచి గుంపులుగా బయలుదేరిన ఏనుగులు పాలెం పంచాయతీలోని మాజీ జెడ్పిటిసి మురళి, కొంగర వారి పల్లికి చెందిన రామనాథం నాయుడుకు చెందిన మామిడి చెట్లను విరిచేసి కాయలను నేలరాల్చాయి. అనంతరం నీటి బోరు పైపులు తొక్కి నాశనం చేశాయి. పశువులకు పెంచుకున్న గడ్డిని తొక్కి విధ్వంసం సృష్టించాయి. పగలంతా అడవుల్లో తిష్ట వేసి రాత్రిపూట పంటలపై పడుతుతున్న అటవీశాఖ అధికారులు తెలిపారు. పశువుల కాపరులు, సమీప గ్రామప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ జి.విద్యాధరి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 16 వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ జి.విద్యాధరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్‌వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల బజారు వీధిలోని జామచెట్టు సమీపంలో విద్యుత్ స్తంభం విరిగిపోయి వొరిగి ఉన్న విషయాన్ని గత నెల 30వ తేదీ ప్రజాశక్తిలో వి(ఒ)రిగిన విద్యుత్ స్తంభం అన్న శీర్షికన వార్త ప్రచురితమైనది. స్పందించిన ట్రాన్స్కో ఏఈ మహేందర్ రెడ్డి, లైన్మెన్ చిన్నపరెడ్డిలు ఆదివారం నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి విద్యుత్ వైర్లను నూతన స్తంభానికి అమర్చి గృహాలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను కనెక్షన్ చేసి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ఈ ప్రాంత వాసులు ఎప్పుడు విద్యుత్ స్తంభం పడిపోతుందోనని భయాందోళనలకు గురవుతూ ఇన్ని రోజులు గడపగా ప్రజాశక్తి వార్తకు స్పందించిన విద్యుత్ అధికారులు నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో ప్రజాశక్తికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసిన దృశ్యం

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన కారును బయటకు తీస్తున్న స్థానికులు

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే వున్న డ్రైనేజీలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కుప్పం పట్టణంలోని శివాజీ మహారాజ్ కూడలి వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన డ్రైనేజీలోనికి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి నష్టం చోటు చేసుకోకపోవడం ఊపిరి పీల్చుకున్నారు. అయితే కారు ముందు వైపు ఉన్న రెండు చక్రాలు కాలువలోనికి దూసుకుపోవడంతో కాసేపు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో కారును బయటకు తీసి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సమస్యను పరిష్కరించారు.

సలహాలు ఇస్తున్న పోలీసులు

గ్రామాల్లో నూతన వ్యక్తులను గుర్తించాలి: సిఐ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గ్రామాల్లో నూతన వ్యక్తులను గుర్తించాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఉదయం మండలంలోని వెలుతురు చేను పంచాయతీలో కార్బన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బయట ప్రాంతం నుండి వచ్చిన వ్యక్తులను గుర్తించాలని, గ్రామాల్లో పాత నేరస్తులు వేరే నేరాల చేయకుండా జాగ్రత్త పడాలని వన్యప్రాణులు వేటనిషేధమని వన్యప్రాణులు వేటలో ఆడేవారిని సమాచారాన్ని సమీప పోలీస్ స్టేషన్లో అందివాలన్నారు. అనంతరం గ్రామంలోని పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, ఎస్ఐ ప్రసాద్, మల్లప్ప, రామచంద్రారెడ్డి హెడ్ కానిస్టేబుల్ దావూద్ పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మండలం, మున్సిపల్ పరిధిలో నిర్వహించిన గంగమ్మ జాతర్లకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆదివారం హాజరయ్యారు. పట్టణ టిడిపి నాయకులతో కలిసి ఆయన అమ్మవారి పూజలో పాల్గొన్నారు. మండలంలోని కొలమాసన పల్లి పంచాయతీ దుగ్గినవారిపల్లిలో నిర్వహించిన గంగమ్మ జాతరలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు సంతోషంగా వుండాలని కోరుకున్నట్లు తెలిపారు. జాతర నిర్వాహకులు ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమాలలో పట్టణ నాయకులు గిరిబాబు, శ్రీనివాసులు, సుధాకర్, శంకరయ్య, పురుషోత్తం, మండల నాయకులు వెంకటరత్నం, గణేష్, రామూర్తి నాయుడు, భాస్కర్, హేమ సుందరం, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా లాటరీ విక్రయాలు

మోసపోతున్న బాధితులు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులోని రెక్క మాను సర్కిల్, రంగ మహల్ థియేటర్ ఎదురుగా, బజారు వీధిలో కొన్నిచోట్ల అనధికారికంగా బడా బాబుల ముసుగులో ఓ వ్యక్తి ఆధ్వర్యంలో జోరుగా లాటరీ విక్రయాలు కొనసాగు తున్నాయని స్థానికులు పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై సంబంధిత ఎస్పై, సీఐ, డిఎస్పి స్పందించి సామాన్యుల కష్టార్జితాన్ని ఇలా దోచేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. గతంలోనూ లాటరీ టికెట్లు విక్రయిస్తుండగా తెలియక కొని నష్టపోయామని కొందరు బాధితులు వాపోతున్నారు. లాటరీ విక్రయాలు కొంతమందికి ఉపాధి అవకాశాలు లభించినా సామాన్యులను లాటరీ విక్రయ ముసుగులో ఆశ చూపించి, అందలం చూపుతూ, నిలువునా మోసగిస్తున్నారు

అలరిస్తున్న దుర్యోధన వధ ఘట్టం

అలరించిన దుర్యోధన వధ ఘట్టం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపలంలో నిర్వహిస్తున్న 95 వ వార్షిక మహాభారత మహోత్సవంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు మట్టితో తయారు చేసిన దుర్యోధన ప్రతిమ వద్ద భీమ, దుర్యోధన యుద్ధ సన్నివేశాలు, రాగయుక్తంగా చూసేవారిని అలరించింది. సాయంత్రం ఆరు గంటల నుంచి అమ్మవారి ఆలయం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నదానం, చేశారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురంలో భారత మిట్టలో వెలసిన ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ ఘటం అలరించింది. మహాభారత ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన దుర్యోధన వధ ఘట్టం ప్రదర్శించడంతో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, నిర్వాహకులు ఎత్తు రాజులు నాయుడు మోహన్ నాయుడు, స్థానిక సర్పంచ్ హరితకుప్పయ్య, నారాయణ స్వామి నాయుడు, కేశవ నాయుడు, మాధవ నాయుడు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కొల్లాగుంట ద్రౌపదీ, ధర్మరాజులస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి భక్తులకు సర్వదర్శనం కల్పించారు, మధ్యాహ్నం భాగవతారిణి భారతి హరికథను ఆలపించారు. మధ్యాహ్నం శ్రీపాండురంగ కళా నాట్యమండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధన వధ ఘట్టానికి కొల్లాగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పట్నం కాంతమ్మ, ఆర్ముగంరెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జ్యోతి వ్యవహరించారు.



నివాళులర్పిస్తున్న ఆర్‌టిసి డిపో మేనేజర్ రూపశ్రీ

డ్రైవరుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన ఆర్‌టిసి చిత్తూరు డిపో డ్రైవరు వీఎల్‌కే కుమార్ రెడ్డి అలియాస్ కరుణరెడ్డి శుక్రవారం కర్నాటకలో రోడ్డు ప్రమాదంలో గాయపడి శనివారం మృతి చెందిన సంగతి విదితమే. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి డ్రైవర్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించడంతో స్వగ్రామం జిడి నెల్లూరు మండలంలోని తూగుండ్రం గ్రామానికి ఆదివారం తీసుకొచ్చారు. స్వగ్రామంలో బంధువులు, భార్యా పిల్లల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆర్టీసీ ఉద్యోగులతో పాటు మేనేజర్ రూపశ్రీ కలిసి డ్రైవర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా కుటుంబానికి అందాల్సిన ఏవైనా ఉంటే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డ్రైవర్‌కి నివాళులు అర్పించిన వారిలో జిల్లా టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి కృష్ణమనాయుడు, మాజీ జెడ్‌పిటిసి చిట్టిబాబు నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, మండల బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతి యాదవ్, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ, జిల్లా టిఎన్ టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, జిల్లా క్రిస్టియన్ సెల్ కార్యదర్శి శాంతకుమార్, టిడిపి నాయకులు నివాళులర్పించారు.

సీనియర్ సిటిజన్లకు న్యాయ సేవా సదస్సు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ఎన్‌జివో హోంలో పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లకు ఆదివారం ప్రత్యేక న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సంస్థ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పిళ్లై అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి ఎం లిఖిత మాట్లాడుతూ 'కుటుంబ ఆస్తుల విషయంలో ముందస్తు ప్లానింగ్ చేయడం వల్ల ఆస్తి వివాదాలు నివారించవచ్చని, సంతానానికి తగిన సమయంలో భాగాల కేటాయింపులు చేయాలి' అని సూచించారు. అర్బన్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణ తేజ మాట్లాడుతూ 'పౌరులు సమస్యల్లో ఉన్నపుడు న్యాయపరమైన హక్కులపై అవగాహనతో పోలీసులను సంప్రదించాలన్నారు. భయ పడకుండా చట్టాన్ని ఉపయోగించుకోవాలి' అని తెలిపారు. ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు ఆనందబాబు మాట్లాడుతూ న్యాయ సేవలు సామాన్యులకు సులభంగా అందుబాటులోకి వస్తుండడం హర్షించదగ్గ విషయం అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్, సీనియర్ అడ్వకేట్ ఆరిపుల్లా, సీనియర్ సిటిజన్స్ యాక్ట్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో పీపీఎస్ కార్యదర్శి నరసింహులు, సేవారత్న శ్రీపురం సీతారామయ్య, పూర్వ అధ్యక్షుడు సిద్దయ్య, ఇతర పీపీఎస్ సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

హక్కులపై మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

గ్రామీణ రహదారి అధ్వానం

పట్టించుకోవాలని ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మండలం కొలమాసన పల్లి బస్టాండ్ నుండి నెల్లిపట్ల గ్రామానికి వెళ్లే తారు రోడ్డు ప్రస్తుతం భారీ వాహనాల తాకిడి వల్ల మట్టి రోడ్డుగా మారి కంకర తేలిందని, రాకపోకలు సమస్యగా మారిందని, వెంటనే పట్టించుకోవాలని ప్రయాణికులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఆదివారం మొరపెట్టు కున్నారు. ఈ సందర్భంగా వాహనచోదకులు మాట్లాడుతూ రోడ్డు అస్తవ్యస్తంగా వుండడంతో ప్రమాదాలకు గురవుతున్నామని పలు సార్లు ప్రమాదాలకు గురైన అనేక మందిని 108 ద్వారా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, గ్రామీణ రహదారిని చక్కదిద్దాలని, కొలమాసనపల్లి గ్రామానికి చెందిన పలువురు నియోజక వర్గ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.



ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ఘనంగా గంగారపు గోపి జన్మదినం

ప్రజాశక్తి -పూతలపట్టు: చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి గంగారపు గోపి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. వేడుకలకు హాజరైన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్‌లు గోపికి స్వీటు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న తమ నాయకుని జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఆనం దంగా వుందన్నారు. టిడిపి కుటుంబ సభ్యులైన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి అధిష్టానం నిత్యం అండదండగా నిలుస్తుందన్నారు. గత 20 సంవత్సరాలుగా పూతలపట్టు మండలంలో దుష్ట శక్తులకు అడ్డు తగిలి పార్టీ కార్యకర్తలను కాపా డుకుంటున్న నాయకుడు గోపి అని కొని యాడారు. పూతలపట్టు మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు శాలువాలతో గోపిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దొరబాబు, చంద్రమౌళి, ఆర్‌ఎస్ బాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగారపు గోపి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 77న రద్దు చేసి అరులైన వారందరికీ ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకం అమలు చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్ కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15,16 తేదీలలో తిరుపతి పట్టణంలోని పిడిఎస్‌యూ రాష్ట్ర కార్యాలయంలో జరుగుతున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీలు పూర్తిచేసుకుని ఉన్నత చదువులకు వెళ్లాలి అనుకునే వారికి 77 జీవో తీవ్ర అడ్డంగా ఉందన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మిగిలిన విద్యార్థి సంఘాల కలుపుకుని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.రాజశేఖర్, ఎం. సునీల్, ఎస్.కె జునైద్ బాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరేంద్ర, రాష్ట్ర కోశాధికారి మహేంద్ర బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మానస, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి వి కోట సమస్యలు

ప్రజాశక్తి -వి కోట : వికోట సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల రైతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని టిడిపి మండల అధ్యక్షులు రంగనాథ్ ఆధ్వర్యంలో టిడిపి నేతలు కలసి వినతి పత్రం సమర్పించారు. ఒక్కరోజు చిత్తూరు జిల్లా పర్యటనకు శనివారం విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి వారికి మండల రైతుల సమస్యలు విన్నవించారు. వికోటలో మామిడి కాయల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులకు అవసరమైన మేరకు వేరుశనగ విత్తనాలు అందించాలని నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో రైతులు అధిక భాగం వర్షాలపై ఆధారపడి వేరుశనగ పండిస్తుంటారని ఒక రైతుకు ఒక బస్తా వేరుశనగ విత్తన కాయలు సరిపోనందున రైతులకు అవసరమైన మేరకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయాలని వారు డిమాండు చేశారు. మండలంలో ఉపాధి హామీ కింద విస్తారంగా మామిడి తోటలు నాటారని, మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని విన్నవించారు. పడమట సరిహద్దు ప్రాంతాలతో పాటు వికోట, బైరెడ్డిపల్లి మండల పరిసర ప్రాంతాల్లో మామిడిపై ఆధారపడ్డ రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర కల్పించాలని టిడిపి నేతలు మంత్రిని కోరారు. వీటితోపాటు మండల పరిధిలోని దీర్ఘకాలిక రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని వారికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రైతు విభాగం అధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, మురుగేష్, చందు, జనార్దన్ రెడ్డి, కోదండ మంత్రిని కలిశారు.

మంత్రిని కలిసిన టిడిపి నేతలు

కాణిపాకం ఆలయ అభివృద్ధికి సహకరించండి

దేవాదాయ కమిషనర్‌తో చర్చించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -ఐరాల: కాణిపాకం ఆలయ అభివృద్ధికి సహకరించాలని దేవాదాయ కమిషనర్‌ను ఎమ్మెల్యే మురళీమోహన్ కోరా రు. కాణిపాకం వరసిద్ధి వినాయకుని దర్శనార్థం విచ్చేసిన రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్‌ని కాణిపాకం అతిథి గృహంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కాణిపాకం వరసిద్ధి వినాయక ఆల యంలో సాగుతున్న అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాన్ అమలు, క్యూ కాంప్లెక్స్ నిర్మాణం, బస్టాండ్ అభివృద్ధి, సిక్స్ లైన్ రహదారి నుండి కాణిపాకం కనెక్టివిటీ రోడ్డు వంటి కీలక అంశాలపై కమిషనర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ప్రాంతాభివృద్ధికి అవ సర మైన సహకారం అందించాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరారు. ఈ సమావేశంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, తవణంపల్లె మండల అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, కాణిపాకం ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై కమిషనర్‌తో ఎమ్మెల్యే, ఈవో చర్చిస్తున్న దృశ్యం

క్రైం న్యూస్

గాయపడ్డ వినోద్

మృతిచెందిన చంద్రమ్మ

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి చెందగా, ఒకరి పరిస్థితి విషమంగా మారిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసు కుంది. ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ కథనం మేరకు... చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం లోని తయ్యూరు గ్రామ పంచాయతీ చిన్న తయ్యూరు గ్రామానికి చెందిన పెరుమాళు భార్య చంద్రమ్మ (60) ఓ శుభకార్యానికి చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారిలోని చిన్న తయ్యూరు వద్ద నడిచి వెళుతుండగా ఎస్ఆర్‌పురం మండలం దిగువ శెట్టివనాత్తం గ్రామానికి చెందిన బాబు కుమారుడు వినోద్ (25) ద్విచక్ర వాహనం వెళుతుండగా ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం చంద్రమ్మను ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో ఉన్న చంద్రమ్మ , వినోద్ లను స్థానికులు హుటాహుటిన 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రమ్మ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వినోద్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రాణి పేట సిఎంసికి తరలించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న రవి

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఇంటి నిర్మాణానికి చేసిన అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని వేపనపల్లి గ్రామంలో వెంకటప్ప కుమారుడు రవి (52) ట్రాక్టరు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం సమీపంలోని మామిడి తోపులో గుర్తుతెలియని గుళికల మందు తినడంతో స్పృహతప్పి పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చిత్తూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నూతనంగా గృహ నిర్మాణం చేపట్టి అప్పులు రూ.11 లక్షలు మేర అధికంగా వుండడంతో అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నారని భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నిందితుడు అరెస్ట్

బంగారం, వెండి స్వాధీనం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఈనెల 4వ తేదీ రాత్రి చిత్తూరులో చోటు చేసుకున్న దొంగతనం కేసులో నిందితుడు ఆనంద్‌ను అరెస్ట్ చేసి సుమారు 12 లక్షల విలువ కలిగిన 131.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 లక్షల విలువ 2.57 కేజీల వెండి , 2 లక్షలు విలువ కలిగిని ఒక కారు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సినిమాలపై ఇష్టంతో, సినిమాలు నిర్మించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు ఆనంద్ పడుతున్నట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. ఇతనిపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక , తమిళనాడు రాష్ట్రాలలో 23 కేసులు ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం లోని మాండ్య పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్‌గా ఉన్నప్పుడు ఒక దొంగతనం కేసులో జువెనైల్ హోంకు వెళ్లాడు. ప్రస్తుతం నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసిన అధికారులు, సిబ్బందిని అడిషనల్ ఎస్పీ అభినందించి నగదు బహుమతులతో అభినందించారు. అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు కేసు వివరాలు తెలుపుతూ ఈనెల నాలుగవ తేదీ తేది రాత్రి చిత్తూరు పట్టణంలోని జండమాను వీధిలో శరవణ బంగారు ఆభరణాల దుకాణంలో గుర్తు తెలియని దొంగలు చెక్క తలుపును పగలగొట్టి సుమారు 131.5 గ్రాములు బంగారు ఆభరణాలు, సుమారు 2 కిలోల వెండి ఆభరణాలు అపహరించారని ఆ షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. రెండు బృందాలుగా ఏర్పడి, ఈ కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్నారు. వీరిని పోలీసు అధికారులు అభినందించారు.

నేడు డిగ్రీ కళాశాలలు ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సోమవారం ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నూతన విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు బీకాం, బిఎ, బిఎస్సి తదితర కోర్సుల్లో రెండు ప్రధానమైన సబ్జెక్టులతో కూడిన డబుల్ మేజర్ విధానం అమలులోకి రానుందని తెలిపారు.

ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా! G. అముధావల్లి, D/o V. గోవిందరాజ్, వన్నెకు క్షత్రియ కులమునకు చెందినవారు. వీరు గుంజుర్లపల్లి గ్రామ పంచాయితీ పెద్దబొమ్మనపల్లి గ్రామం, శాంతిపురం మండలం నందు స్థిర నివాసం వుంటున్నారు. అముధావల్లి శాంతిపురం బస్‌స్టాప్ నందు బస్సు కోసం వేచి వున్న సందర్భంలో కుప్పం సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు తన పేరునకు రిజిస్టరు కాబడి యుండు దస్తావేజు నెం.2040/2007 కు సంబంధించి ఒరిజినల్ దస్తావేజు లోని చివరి పేజి (పేజినెం.5) ను పోగొట్టుకున్నారు అని మీ సేవ ద్వారా No. MLDO 12500 532969 గా రాళ్లబూదుగూరు పోలీసు వారికి ఫిర్యాదు చేసినారు. ఆ దస్తావేజు పేజిని వారు పోగొట్టుకున్న ప్రదేశంలో పరిశీలించగా దొరకలేదు. కావున సదరు దస్తావేజు నకలును సంబంధిత కుప్పం SRO వారి నుండి పొందవలసిందిగా సూచించడమైనది.

ఇట్లు,
I. NARESH,
STATION HOUSE OFFICER,
Rallabuduguru P.S.